# నీటితొట్లు నిరుపయోగం

- దాహంతో అల్లాడుతున్న జీవాలు
- నిర్వహణను గాలికొదిలేసిన అధికారులు
- వినియోగంలోకి తీసుకురావాలంటున్న రైతులు

అసలే ఎండాకాలం.. దానికి తోడు ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. గుక్కెడు నీటికోసం మనుషులే అల్లాడుతుంటే.. మరి మిగిలిన జీవాల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. వాగులు, కుంటలు ఎండిపోవడంతో దాహార్తి తీరక అల్లాడుతున్నాయి. పశువుల దప్పిక తీర్చేందుకు ప్రభుత్వం గ్రామాల్లోని చివరన, పంటపొలాలకు వెళ్లే ప్రధాన రహదారుల పక్కన కొన్నేళ్ల కిందట నీటితొట్లు నిర్మించారు. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అవి ఇప్పుడు నిరుపయోగంగా మారాయి. దీంతో మూగజీవాలు తాగు నీటి కోసం కటకటలాడుతున్నాయి.

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలో 31 గ్రామాలు ఉండగా ఇటీవల కొత్తగా మరో ఆరు గ్రామాలు ఏర్పడడంతో మొత్తం 37 గ్రామ పంచాయతీలయ్యాయి. పశువుల దాహార్తిని తీర్చాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం గతంలో కొన్ని గ్రామాల్లో నీటితొట్లను నిర్మించింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వాటిని ఏర్పాటు చేశారు. కాని నేటికీ వాటిని వినియోగించిన దాఖాలాలు లేవు. మండలంలోని బొడిగెపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎదుట, పంటపొలాలకు వెళ్లే ప్రధాన రహదారి పక్క మరొక నీటితొట్టిని నిర్మించారు. ప్రస్తుతం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎదుట ఉన్న నీటితొట్టిలో నీటితో నింపి మిగిలిన మరొక దాంట్లో నీళ్లు నింపకపోవడంతో గ్రామస్తులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున నీరు దొరక్క పశువులు, మేకలు, గొర్రెలు, పక్షులు అల్లాడుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు.


బొడిగెపల్లిలో నిరుపయోగంగా ఉన్న నీటితొట్టి

### ఎండిన చెరువులు, కుంటలు

ఎండల తీవ్రతకు మండల పరిధిలోని వాగులు, చెరువులు, కుంటలు పూర్తిగా ఎండిపోయాయి. మేత కోసం పొలాలకు వెళ్లిన మూగజీవాలు తాగునీటి కోసం తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నాయి. పశువుల దాహార్తిని తీర్చేందుకు కొంత మంది రైతులు వ్యవసాయ, బోరు బావుల వద్ద నీటిని నిల్వచేసి పశువుల దాహార్తిని తీరుస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న నీటితొట్లను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

### వినియోగంలోకి తీసుకు వస్తాం



పశువుల దాహార్తి తీర్చేందుకు గ్రామాల్లో నిర్మించిన నీటితొట్లను వినియోగంలోకి తీసుకువస్తాం. రోజురోజు ఎండ తీవ్రత పెరుగుతోంది. ప్రతి నీటితొట్టిలోను నీరు నింపాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలను జారీ చేస్తాం. నిరుపయోగంగా ఉండకుండా చూస్తాం.

- భానోతు జయరాం, ఎంపీడీఓ అక్కన్నపేట మండలం

## క్లుప్తంగా

### ఇటిక్యాల పాఠశాలలో ఏఐ బోధన ప్రారంభం


ఏఐ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ మాధవరెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని ఇటిక్యాల ప్రాథమిక పాఠశాలలో కృతిమ మేధ బోధన(ఏఐ) ల్యాబ్‌ను ఎంఈఓ మాధవరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరం నుంచి పాఠశాలలో ఏఐ బోధన ప్రారంభిస్తున్నారన్నారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపించాలని కోరారు. చదువుతో పాటు చిత్ర లేఖనం, కంప్యూటర్ విద్య, ఇండోర్ గేమ్స్ ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం శంకర్, ఉపాధ్యాయులు నరేందర్, శ్రీనివాస్‌రెడ్డి, భవాని, కమృద్దిన్ పాల్గొన్నారు.

### విద్యార్థుల ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న చిన్నారులు, ఉపాధ్యాయులు

అక్కన్నపేట(హుస్నాబాద్): పాఠశాలలోని చిన్నారులంతా తోటి స్నేహితురాలికి ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని కట్కూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థిని చిలుక పావని తండ్రి రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆ చిన్నారి స్నేహితులందరూ వారి తల్లుల చేత వివిధ రకాలైన ఆహార పదార్థాలను తయారు చేయించి పాఠశాలలో 'ఫుడ్ ఫెస్టివల్' నిర్వహించి వాటి అమ్మకాల ద్వారా రూ.5,016 సంపాదించారు. ఈ మొత్తాన్ని హెచ్ఎం, ఉపాధ్యాయులు సమక్షంలో పావని తల్లికి సోమవారం అందజేశారు.

### ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు


పూజల్లో పాల్గొన్న రాజమౌళి తదితరులు

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని అతి పురాతనమైన సీతారామ-ఉమామహేశ్వర దేవాలయ బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రామాలయంలో సుదర్శనాచార్యుల వైదిక నిర్వహణలో ప్రధానార్చకులు శ్రీనివాసాచార్యులు, వరుణాచార్యులు సోమవారం వాసుదేవ పుణ్యాహవచనము, ధ్వజారోహణ, విశ్వక్సేనారాధన కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకుడు మఠం వీరభద్రయ్య ఆధ్వర్యంలో వీరశైవులు రుద్రాభిషేకం, భేరీపూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, పురోహితులు రాజశేఖరశర్మ, నందబాలశర్మ, ధర్మకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### పాఠశాలలే ప్రగతికి సోపానాలు

మండల విద్యాశాఖ అధికారి రమేశ్


విద్యార్థులతో ఎంఈఓ రమేశ్, ఉపాధ్యాయులు

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాలలే ప్రగతికి సోపానాలని ఎంఈఓ రమేశ్ అన్నారు. మండలంలోని గౌరాయపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం గ్రాడ్యుయేషన్ డేను హెచ్ఎం చంద్రం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, తల్లి దండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. అనంతరం ఏడో తరగతి విద్యార్థులకు ఉత్తీర్ణత ధ్రువపత్రాలను అందజేశారు. ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సారయ్యకు సన్మానం


సారయ్యను సన్మానిస్తున్న కురుమ కులస్తులు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని లద్నూరుకు చెందిన ఒగ్గు కళాకారుడు సారయ్యకు యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ పీస్ కౌన్సిల్ డాక్టరేట్ ప్రదానం చేసింది. దీంతో గ్రామానికి చెందిన కురుమ కులస్తులు సోమవారం స్థానిక బీరప్ప దేవాలయంలో సారయ్యను ఘనంగా సన్మానించారు. ఆయనకు డాక్టరేట్ రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సంఘం పెద్దలు పాల్గొన్నారు.

## ఘనంగా మంత్రి వివాహ రజతోత్సవం

హుస్నాబాద్: మంత్రి పొన్నం ప్రభాకర్ మంజుల దంపతుల వివాహ రజతోత్సవ వేడుకలను కాంగ్రెస్ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ చిత్తారి పద్మ ఆధ్వర్యంలో ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్‌చేసి మున్సిపల్ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి మాట్లాడుతూ హుస్నాబాద్ ప్రాంత అభివృద్ధి కోసం మంత్రి పొన్నం చాలా కృషి చేస్తున్నారన్నారు. ఇప్పటికే రూ.18 కోట్ల వ్యయంతో ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. 250 పడకల ఆస్పత్రి, ఇంజనీరింగ్ కళాశాల మంజూరు, జంక్షన్ల అభివృద్ధి, రూ.50 లక్షల వ్యయంతో ఎల్లమ్మ ఆలయ గోపురం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. మంత్రి పొన్నం భవిష్యత్‌లో మరిన్ని ఉన్నతమైన పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ శివయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ చందు, నాయకులు రవీందర్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ సిబ్బందికి చీరలు పంపిణీ చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి

## ప్రతిభను వెలికితీయడానికే సమ్మర్ క్యాంపు

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకొని తమలోని ప్రతిభను చాటాలని ఎంఈఓ కృష్ణ పిలుపునిచ్చారు. కొడకండ్ల ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయుడు మధునాల శ్రీనివాస్‌తో కలిసి సమ్మర్ క్యాంపునకు సంబంధించిన కరపత్రాలను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొడకండ్ల పాఠశాలలో 24 నుంచి మే 15 వరకు సమ్మర్ క్యాంపు నిర్వహించనున్నట్టు చెప్పారు. 3 నుంచి 12యేళ్లలోపు విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలు, క్రీడలు, యోగా, మెడిటేషన్, పద్యాలు, చేతిరాత, చిత్రలేఖనంపై శిక్షణ ఇస్తారని చెప్పారు. అలాగే సామాజిక అంశాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు ఈ శిక్షణ శిబిరం ఉంటుందని, తల్లి దండ్రులు తమ పిల్లలను పంపించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, గ్రామస్తులు మహేందర్‌రెడ్డి, అంజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ కృష్ణ

## సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

దుబ్బాక: రాయపోల్ మండలం రాంసాగర్ గ్రామంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో 9వ వార్షికోత్సవ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నాలుగు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు అవాహిత దేవతాపూజ, అవాహిత దేవతా హవనము తదితర కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో వేద పండితులు, ఆలయ కమిటీ బాధ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


వ్రతమాచరిస్తున్న దంపతులు

## సీసీ రోడ్డు నిర్మించాలని గ్రామస్తుల వినతి

గజ్వేల్‌రూరల్: గుంతలమయమైన రోడ్డుపై ప్రయాణంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సీసీ రోడ్డు నిర్మించి తమన సమస్యను పరిష్కరించాలని అయ్యప్పనగర్ వాసులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్యకు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్యతో కలిసి కాలనీవాసులు రాజేశం తదితరులు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నో యేళ్లుగా రోడ్డు సరిగాలేక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. గతంలో పలుమార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా సమస్యను పరిష్కరించలేదని వాపోయారు. ఇప్పటికైనా స్పందించి అయ్యప్పనగర్‌లోని సత్య ఫంక్షన్ హాల్ వీధి చివరి వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని, అలాగే శానిటేషన్ పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో అయ్యప్పనగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.


మున్సిపల్ కమిషనర్ నర్సయ్యకు వినతిపత్రం అందజేస్తున్న అయ్యప్పనగర్ కాలనీవాసులు

### వరంగల్ సభను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ ఆవిర్భావ సభకు పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎంపీపీ మాణిక్యరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కామిని శ్రీనివాస్, సొసైటీ చైర్మన్‌లు కనకరాజు, సదానందం పిలుపునిచ్చారు. మండల పరిధిలోని విఠలాపూర్, గంగాపూర్, చెలుకలపల్లి, ఎల్లాయపల్లి, కిష్టాపూర్ గ్రామాల్లో సోమవారం సన్నాహక సమావేశాలు నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ సభకు మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

### విద్యార్థుల తల్లిదండ్రులతో రేపు సమావేశాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోను బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు సమావేశాలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేసవి సెలవుల దృష్ట్యా విద్యార్థులు పాటించాల్సిన అంశాలు, తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చర్చించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు హాజరై ఉపాధ్యాయులు సలహాలు, సూచనలను స్వీకరించాలని సూచించారు.


నంగునూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

## ప్రభుత్వ పాఠశాల్లోనే చేర్పించండి

ఎంఈఓ దేశిరెడ్డి

నంగునూరు(సిద్దిపేట): ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని ఎంఈఓ దేశిరెడ్డి తల్లిదండ్రులను కోరారు. నర్మేట ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మనీష్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా తిరిగి కరపత్రాలు పంచుతూ విద్యార్థులను తమ పాఠశాలలో చేర్పించాలని అభ్యర్థించారు. కార్యక్రమానికి ఎంఈఓ దేశిరెడ్డి హాజరై ముందే అడ్మిషన్లు తీసుకుంటున్న హెచ్ఎం మనీష్ కుమార్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో బోధన అందిస్తున్నామని, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు అందజేస్తున్నామని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పిలుపునిచ్చారు.

**మిరుదొడ్డిలో..**

మిరుదొడ్డి(దుబ్బాక): నూతన విద్యాసంవత్సరానికి తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరుతూ అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని మోతె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందుతుందని, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు, యూనిఫామ్‌తో పాటు అన్ని మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తుందని తల్లిదండ్రులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, హెచ్ఎం అబ్రహం, ఉపాధ్యాయులు ర్యాకం మల్లేశం, హరికృష్ణ, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కార్పొరేట్‌కు దీటుగా..**

దుబ్బాక: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా నాణ్యమైన విద్యను బోధిస్తున్నామని వడ్డెపల్లి జెడ్పీ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం సుధాకర్‌రెడ్డి అన్నారు. రాయపోల్ మండలం వడ్డెపల్లిలో సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఉపాధ్యాయులు రజని, సుధాకర్, ఇంద్రసేనారెడ్డి, వరప్రసాద్, మోహన్, కరుణాకర్, అనిల్ కుమార్, రాజయ్య తదితరులు ఉన్నారు.


దుబ్బాక: వడ్డెపల్లిలో బడిబాట కార్యక్రమం

**ప్రైవేట్ పాఠశాలలతో అదనపు భారం**

కొండపాక(గజ్వేల్): ప్రైవేటు పాఠశాలలకు తమ పిల్లలను పంపించి అదనపు భారాన్ని నెత్తిన వేసుకోవద్దని మండల విద్యాధికారి బచ్చలి సత్తయ్య అన్నారు. కుకునూరుపల్లి మండలంలోని మేదినీపూర్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో సోమవారం నిర్వహించిన వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారు చాలా ఉన్నత స్థాయి హోదాల్లో ఉన్నారని, తాను కూడా ప్రభుత్వ పాఠశాల్లో చదివే ఈ స్థాయికి చేరానని చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతినకుండా చూసేందుకు ప్రభుత్వం రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తోందని, ప్రభుత్వ పాఠశాల్లో చదివిన విద్యార్థులకే ట్రిపుల్ ఐటీలో సీటు లభిస్తుందని తెలిపారు. వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశం, ఉపాధ్యాయులు వెంకటరమణ, వెంకటలక్ష్మి, ఏఏపీసీ చైర్ పర్సన్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొ న్నారు.

## మార్కెట్ కమిటీ పాలక వర్గానికి మోక్షం

- చైర్మన్, వైస్ చైర్మన్ల బాధ్యతల స్వీకరణ
- 15 యేళ్ల అనంతరం మోక్షం

కొండపాక(గజ్వేల్): మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గానికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. పాలకవర్గం నియామక ఉత్తర్వుల జారీ నేపథ్యంలో కార్యాలయంలో సోమవారం పాలకవర్గం బాధ్యతలను చేపట్టింది. చైర్మన్‌గా మేదినీపూర్‌కు చెందిన విరుపాక శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా బట్ట పరశురాములు, డైరెక్టర్లుగా శివలింగ కృష్ణమూర్తి, రెడ్డమైన రవీందర్, నాగపురి సుజాత, అంబటి రాజు, చుక్క యాదయ్య, మహమ్మద్, తాళ్లపల్లి అంజయ్య, కొమ్ము మల్లికార్జున్, శిలాసాగరం శ్రీనివాస్, వడ్లకొండ రాజు, పెరుగు తిరుపతి, వడ్లకొండ శ్రీనివాస్‌తో పాటు నలుగురు ఎక్స్ అఫీషియో సభ్యులు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టే పథకాలను అర్హులందరికీ అందేలా కృషి చేస్తాన్నారు. చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. 15 యేళ్లుగా పెండింగ్‌లో ఉన్న మార్కెట్ కమిటీ పాలక వర్గం నియామక ప్రక్రియ వెలువడటంతో కాంగ్రెస్ నాయకులు జై కాంగ్రెస్, జై రేవంత్‌రెడ్డి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు లింగారావు, నాయకులు సురేందర్‌రావు, వెంకట్‌రెడ్డి, రెడ్డమైన రవీందదర్, తూం శ్రీకాంత్‌రెడ్డి, కోల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.


చైర్మన్, వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్న శ్రీనివాస్‌రెడ్డి, పరశురాములు

## అంగన్వాడీల ద్వారానే పౌష్టికాహారం

ఐసీడీఎస్ సీడీపీఓ శారద

సిద్దిపేటరూరల్: ప్రభుత్వం అంగన్వాడీల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీడీపీఓ శారద సూచించారు. మండల పరిధిలోని రాఘవాపూర్‌లో సోమవారం పౌష్టికాహారంపై అవగాహన, సామూహిక సీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. పోషణపక్షంలో భాగంగా సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారుల్లో వస్తున్న నైపుణ్యాలు, సేవలు, ఇంటి వద్దనే దొరికే పోషకాలు, పౌష్టికాహారం గురించి తల్లులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చిన్నారులకు అంగన్‌వాడీల్లో అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. పిల్లలుకు ఆదేళ్లు వచ్చే వరకు అంగన్‌వాడీకి పంపించాలని సూచించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ అరవింద, లావణ్య, వైద్య అధికారులు చారి, రాజు, ఏఎన్ఎం పద్మావతి, అంగన్‌వాడీలు సురేఖ, మాధవి, రజిత, పవిత్ర, వెంకటమ్మ, మౌనిక, నవీన, కనకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


రాఘవాపూర్‌లో మాట్లాడుతున్న సీడీపీఓ శారద

**పౌష్టికాహారం తప్పనిసరి**

కొమురవెల్లి(సిద్దిపేట): గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని చేర్యాల సీడీపీఓ రమాదేవి సూచించారు. మండలంలోని అయినాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ్ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక సీమంతాలు, చిన్నపిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పోషణ్ పాక్వాడ కార్యక్రమం ద్వారా మహిళల ఆరోగ్య రక్షణ చర్యలు పెరిగాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.


కొమురవెల్లి(సిద్దపేట): అయినాపూర్‌లో చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న సీడీపీఓ రమాదేవి

## సంక్షిప్త వార్తలు

**◆ చెక్కు అందజేసిన సీపీ అనురాధ**

సిద్దిపేటకమాన్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ నవీన్ కుటుంబ సభ్యులకు సీపీ కార్యాలయంలో డిపార్ట్‌మెంట్ భద్రత నుంచి వచ్చిన రూ.16 లక్షల చెక్కును సోమవారం అందజేసినట్లు సీపీ అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోలీసు కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి అండగా భద్రతా స్కీమ్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఓ యాదమ్మ, రాష్ట్ర పోలీసు సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**◆ వేధిస్తున్న యువకుడిపై కేసు**

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రేమ పేరుతో వేధిస్తున్న ఓ యువకుడిపై కేసు నమోదైంది. ఎస్ఐ విజయ్‌భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ యువతిని ఆమె గ్రామానికే చెందిన భూక్య వంశీ ప్రేమ పేరుతో వెంటపడుతున్నాడు. పలుమార్లు తల్లిదండ్రులు మందలించినా మానుకోలేదు. ఈ క్రమంలో 19న తల్లిదండ్రులు ఇంట్లోలేని సమయంలో ఇంటికి వచ్చి యువతిపై దాడికి దిగాడు. తనను కాదని మరొకరిని ఎలా పెళ్లి చేసుకుంటావో చూస్తానని బిదిరించాడు. దీంతో యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

**◆ మందుబాబులకు జరిమానా**

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 22 మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి సోమవారం వారికి రూ.50,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

**◆ పేకాటరాయుళ్ల అరెస్టు**

కొండపాక(గజ్వేల్): పేకాడుతున్న నలుగురిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు. మర్పడ్గ గ్రామ శివారులో మద్దూర్ బాలయ్య వ్యవసాయ బావి వద్ద పేకాడుతున్నారన్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్సు, త్రీ టౌన్ పోలీసులు సంయుక్తంగా దాడిచేసి నలుగురిని అదుపులోకి తీసుకొన్నారు. మరొకరు పారిపోగా వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు, రెండు బైకులను స్వాధీనం చేసుకొన్నట్టు సీఐ తెలిపారు.

**◆ కొనుగోలు కేంద్రాల ద్వారానే మద్దతు ధర**

తొగుట(దుబ్బాక): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారానే రైతులు మద్దతు ధర పొందాలని పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి సూచించారు. మండలంలోని గుడికందులలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిధిలో 17 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పలిన్ కవర్లు అందుబాటులో ఉంచామని చెప్పారు. మాజీ సర్పంచ్ మల్లయ్య, పీఏసీఎస్ సీఈఓ గంగారెడ్డి, రైతులు భైరారెడ్డి పాల్గొన్నారు.

**ఎన్సాన్‌పల్లిలో..**

సిద్దిపేటఅర్బన్: ఎన్సాన్‌పల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్‌ల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి బొల్లం రవీందర్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఏ ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారన్నారు. ఎల్లం, ప్రశాంత్, సత్యనారాయణ, నర్సయ్య, బాల్‌రాజ్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

**◆ తహసీల్దార్‌కు వినతి**

బెజ్జంకి(సిద్దిపేట): టీఎస్ఐఎస్ ఇండస్ట్రీ కోసం దాచారంలో సేకరించిన భూములకు పరిహారం ఇప్పించాలని భూ నిర్వాసితులు తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి సోమవారం వినతి పత్రం అందజేశారు. 360 ఎకరాల భూమిని సేకరించగా 90 ఎకరాలకు సంబంధించిన 50 మందికి డబ్బులు రాలేదని వాపోయారు. వెంటనే పరిహారం ఇప్పించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బాలనర్సు, పోచయ్య, మల్లయ్య, సదానందం పాల్గొన్నారు.

### భూ భారతితో సమస్యల పరిష్కారం: హమీద్

తొగుట(దుబ్బాక): భూ భారతి చట్టంతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు. స్థానిక రైతు వేదికలో భూ భారతి భారతి చట్టంపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చట్టం ద్వారా రెవెన్యూ శాఖలో అనేక మార్పులు రానున్నాయని తెలిపారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. భూ భారతి చట్టాన్ని ప్రజల్లోకి తీసుకుపోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సిద్దిపేట ఆర్డీఓ సదానందం, మండల ప్రత్యేకాధికారి మల్లయ్య, తహసీల్దార్ స్రవంతి, ఏఓ మోహన్, ఆర్ఐ అశోక్, ఐకేపీ ఎపీఎం శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.